గొల్లపూడి కాలమ్

# కంచి స్వామి

కంచి స్వామి హత్య చేయించారా, ఆయనే హత్యకు ప్రధాన కారకులా అన్న ప్రశ్నకీ ఈ కాలమ్‌కీ ఎటువంటి సంబంధం లేదు.

ఈ కాలమ్ లోనే పది సార్లయినా చెప్పిన ఓ సంఘటనని మళ్ళీ మళ్ళీ చెప్పినా తప్పు లేదు. స్వాతంత్ర్య పోరాట సమయంలో మహాత్ముడిని అరెస్టు చేశారు. కోర్టుకి తీసుకొచ్చారు. ఆయన కోర్టులోకి వస్తూనే న్యాయస్థానంలో వున్న వారంతా లేచి నిలబడ్డారు. చివరికి బ్రిటిష్ న్యాయమూర్తీ లేచి నిలబడ్డారు. ఇంకా నేరం గురించి చర్చ ప్రారంభం కాలేదు. కాని సిద్ధాంత పరంగా– ఓ వ్యక్తికి వ్యవస్థ ఇచ్చే కనీసమైన గౌరవం అది.

ఈ దేశంలో ఎన్నో మారణహోమాలకి కారణమైన ఇక్బాల్ మసూద్ ని విదేశాంగ మంత్రి స్వయంగా తీసుకెల్లి– కాందహార్ లో అప్పగించి వచ్చారు. హంతకులకీ, నేరస్తులకీ ప్రభుత్వం తలవొంచిన సందర్భమిది.

రివాల్వర్ తో కాల్చిన సినీ నటుడిని, కాల్పులు తిన్న ఇద్దరూ ఎదురుగ్గా కనిపిస్తూండగానే– చలవగదుల్లో– ఆసుపత్రిలో వుంచి సగౌరవంగా ఇంటికి పంపారు. ఓ సినిమా నటుడికి ఆసుపత్రి అధికారులు పెద్దమనస్సుతో చేసిన ఉపకారమిది.

ఉమా భారతి మీద నాన్ బెయిలబుల్ వారెంటులు పదే పదే వున్నా– ఏనాటికో లొంగిన ఆమెని గెస్టుహౌస్‌లో వుంచి– తరువాత ప్రభుత్వమే పూనుకొని విడుదల చేసింది. ఓ పార్టీ మరొక పార్టీకి చేసిన లోపాయకారీ సహాయమిది.

పెరట్లో అస్థి పంజరాల్ని తవ్వి తీస్తే, గూండాలు జైళ్ళల్లో పుట్టిన రోజులు చేసుకొంటూంటే, ముఠా నాయకులు (అరుణ్ గౌలీలు) ఆనందంగా పార్లమెంటుకి ఎన్నికవుతూంటే – ఈ వ్యవస్థ చేతికి గాజులు తొడిగించుకొని వేడుక చూస్తోంది.

ఆలనాడు ఇందిరాగాంధీని అరెస్టు చేసి ఓ గెస్టుహౌస్‌లో పెట్టారు. మరి ఇందిరాగాంధీ, మరెందరో రాష్ట్రపతులూ,రాజులూ మోకరిల్లే ఓ సన్యాసిని దీపావళి పండుగ పూటా జైల్లో పెట్టారు.

1975 జూన్ 25 అర్ధరాత్రి తలుపు తట్టిలేపి జయప్రకా ష్ నారాయణ్‌ని అరెస్టు చేస్తే 'వినాశకాలే విపరీత బుద్ధిః' అన్నారు. ఆయన గొంతు ఇవాల్టిదాకా వినిపిస్తోంది. ఈ మాట పండగ పూటా ఎన్ని కోట్ల మంది అనుకున్నారో తెలీదు.

పీలూ మోడీని రాత్రి అరెస్టుకు నిద్రలేపితే 'పొద్దుటి దాకా పడుకోనివ్వక నా

నిద్ర ఎందుకు చెడగొడతారయ్యా?' అన్నారట. 'నేనేం వీరప్పనా?' అని మాత్రం అన్నారట స్వామి.

మెహబూబ్ నగర్‌లో కంచి స్వామి అరెస్టుకి ముఖ్య మంత్రిగారు ఢిల్లీ అనుమతిని తీసుకొన్నారట. ప్రవీణ్ తొగాడియా చెన్నైలో స్పందిస్తూ 'ఢిల్లీ సూపర్ ప్రధానిని అడగండి. వాళ్ళ దేశంలో క్రిస్టమస్ నాడు వాటికన్‌లోకి వెళ్ళి పోప్‌ని ఎవరయినా అరెస్టు చేస్తారేమోనని'అన్నారు.

ముస్లిం మత గురువు సయ్యద్ బుఖారీ మీద చాలా కేసులున్నాయి. నాన్ బెయిలబుల్ వారెంట్లు వున్నాయి. ఆయన ఢిల్లీ లోనే వున్నారు. ఈద్ నాడు వారినెవరైనా అరెస్టు చేసే దమ్ముందా?

చెన్నై లో మస్తాన్ అలీ అనే ముస్లిం- ఉమాభారతికిచ్చిన పాటి మర్యాదకి- పవిత్రమైన ఓ సన్యాసి నోచుకోలేదా? అని అడిగాడు.

కేరళ కాథలిక్ చర్చి ఈ పనికి తీవ్రమైన నిరసనని తెలిపింది. ఎన్నో ముస్లిం సంస్థలు నిరసించాయి.

చట్టానికి ఎవరూ అతీతులు కారు అన్నారు- మానవాళి అభ్యుదయానికి మనుషుల్ని చంపే ఓ పార్టీ నాయకులు. వారు రష్యాలో వున్నారో, చైనాలో వున్నారో నా కయితే తెలీదుకాని- ఈ దేశంలో చట్టాన్ని మనం ఎంత ఘోరమైన స్థాయికి తెస్తున్నామో ఒక్క బెస్టు బాకరీ కేసు, ఓ జహీరా షేక్ కథా చాలు. డబ్బు, అధికారం, బెళ్ళింపూ ఈ దేశంలో చట్టాన్ని ముప్పతిప్పలూ పెడుతున్న నేపథ్యంలో ఏ చట్టానికి ఎవరు అతీతులు కారో నాలాంటి నేలబారు మనిషికి అర్ధం కాదు.

మధుమేహంతో, రక్తపు పోటుతో బాధ పడుతున్న ఓ 70 య్యేళ్ళ ముసలి సన్యాసిని,తన చేతుల్తో తను వండుకు తినే నిష్టాపరుడిని జైల్లో పెట్టారు.

కాకీ చొక్కా వేసుకొని కార్పొరేషన్ మనిషి వస్తే పోలీసులని పారిపోయే పిరికివాళ్ళ ఈ దేశంలో హిందువులు అన్నారు నిన్న ఒకాయన చెన్నై లో.

కంచి స్వామి అరెస్టుకి చంకలు గుద్దుకొంటున్న కరుణానిధిని 'ఓవర్ యాక్షన్' అన్నారు సుబ్రహ్మణ్యస్వామి. దాదాపు రెండు దశాబ్దాలు ఓ రాష్ట్ర ం ఎన్నిక చేసిన నాయకుడు- ఆ రాష్ట్రంలోవున్న మెజారిటీ మతం sensitivities నయినా పరిగణించ కుండా- ప్రకటనలు యివ్వడం చాలా దయనీయమైన విషయం. ఇంత హీన స్థితిలో వున్నారా మెజారిటీ ఎన్నిక చేసిన నాయకులు!

కంచి స్వామికి యివ్వగలిగిన కనీస మర్యాదని యివ్వలేని ఈ దేశంలో 83 కోట్ల

హిందువులు political orphans (రాజకీయ ఆనాథలు) ఆన్నారు ప్రవీణ్ తొగాడియా.

మొన్ననే 90 సంవత్సరాలు నిండిన ఓ మహనీయ న్యాయమూర్తి వి.అర్. కృష్ణయ్యర్ మాటలు:'To be gentle is to be just and the quality of mercy is not strained"

మరొక్కసారి- ఈ కాలమ్ ఉద్దేశం కంచి స్వామి నేరాన్నో, నేరంతో ప్రమేయాన్నో విశ్లేషించడం కాదు. 83 కోట్ల మంది హిందువులున్న ఈ దేశంలో 2000 సంవత్సరాల వ్యవస్థ ఆధిపతికి- దక్కవలసిన మానవతా మర్యాద కూడా యివ్వలేనంత 'పరాయి' పాలనలో వున్నామా మనం? పరాయి పాలకులే మనల్ని గౌరవించిన మహత్తరమైన సంఘటనలు ఇంకా మన కళ్ల ముందున్నాయి కదా!

ఈ దీపావళి శోకాంధ తిమిరావళి- బెదిరించినప్పుడో, బ్లాక్‌మెయిల్ చేసినప్పుడో, స్వజనానికో, స్వలాభానికో- తలవంచే ఆధోగతిలో మన రాజకీయ వ్యవస్థ వున్నందుకు.

(తాజాకలం: నేను విశ్వహిందూ పరిషత్ సభ్యుడినికాను. ఆర్.ఎస్.ఎస్, భారతీయ జనతా పార్టీ సభ్యుడినీ కాదు. నేను ఓ హిందువును.)

------------------

(రచయితని www.gollapudimaruthirao.com లో కలుసుకొనవచ్చును.)